# సుందరి - సుందరుడు

జగదేకసుందరికి అతిలోక సుందరుడు – ఎన్నడూ దొరకడు . అదొక రూలు. దీన్నే మనవాళ్ళు మంచి అన్నంలోకి మంచి కూర దొరకదంటుంటారు. ఫైన్ రైసులోకి పుచ్చు వంకాయలు కూర , పుల్లటి మజ్జిగ ఎలాగో , అందగాడయిన మగాడికి అనాకారి పెళ్ళం లేక వైస్ వెర్సాకేసులు అలాగా, ఇలాంటి సృష్టి, చిత్రాలను గురించి , వేదాంతులని అడిగితే, పూర్వ జన్మలో ఓపిగ్గా మూట కట్టుకున్నా పాప ఫలం అంటారు. అదే రచయితలయితే, జీవితంలో నాటకీయం అనో విధి మనుషులతో ఆడుతున్న ఆటనో అంటారు. ఎవరేమన్నా నిజాలు నిజాలు కాకుండా పోవు. సౌందర్యోపాసకుడైన వాడికి ఎద్దు మొద్దు స్వరూపం సంప్రాప్తిస్తే ఉపాసకుడు వుపవాసాలు మొదలెడతాడు. అలాగే భావకురాలైన దానికి బడుద్దాయి మగాడు తగిలితే భావరాహిత్యం తప్ప వేరే చిక్కుండదు.

వీధిలో మనం వెడుతున్నప్పుడు రకరకాల వాళ్ళని చూస్తుంటాం. వాళ్ళలో పాలరాతి శిల్పాల లాంటి పిల్ల కనిపిస్తే ఆహా అంటూ ఆశ్చర్యపోయి పని లేక పోయినా పది నిమిషాలు ఆవిడనే చూస్తూ కాలం గడిపేస్తాం ఇంత అందమైన దాన్ని కట్టుకున్న అదృష్టవంతుడెవడో గదాని వూహాగానం కూడా చేస్తాం. ఆ అందాల భరిణ అయిదో నెంబరు బస్సెక్కి వెళ్ళిపోతుంది. కథ అక్కడితో ఆగిపోతుంది. అలా కాక మనం కూడా ఆ జగదేక సుందరిని ఇంటిదాకా ఫాలో అయితే, వీధి అరుగుపైనే కనిపిస్తాడు సుందర నాథుడు. కాని మనం నమ్మలేం. అంత ముచ్చటగా , కనుల విందు చేసేటట్లుగా వుంటాడు. బొగ్గుల బస్తాకి కాళ్ళూ చేతులూ తగిలించి వూపిరి పోస్తే అచ్చు అలానే వుంటాడు. పైగా మిలట్రీ మీసాలు, వాడ్ని చూడగానే జగదేకసుందరి పైన మనకి బోల్డంత జాలి పుట్టుకొస్తుంది. ‘ సుందరీ ! కనీసం మళ్ళీ జన్మకైనా నీకు తగ్గ సుందరుడు కోసం పూజలు పునస్కారాలు చేసుకో. ఖర్చుకు వెనకాడకు కావాలంటే ఆకులు , పళ్ళూ ఫ్రీగా నే డొనేట్ చేస్తా ’ నంటూ గుండె నిండా కన్నీళ్ళు కారుస్తాం. గమనించాలే గాని ఇలాంటి సృష్టి వికారాలు, విచిత్రాలు అనేకం. ఇరవై నాలుగు గంటలూ పూజలు, వ్రతాలు అనే ఇల్లాలికి ఉదయం నుంచే ఆన్లోవుండే పెనిమిటి, సంగీత విద్వాంసుడికి సంగీత మనగా అదొక అర్థం కాని కాకిగోల అనిచెప్పే భార్య దొరకడం సృష్టి వికారం కాక మరేమిటి ?

అందచందాలే కాకుండా అలవాట్లు , ఆలోచనల్లో కూడా జోడీ కుదరని జంటలుంటాయి. ఒకసారి ఒక జడ్జి గారి దగ్గరకి విడాకులు కావాలంటూ ఒక దంపతులొచ్చేరట. జడ్జిగారు డ్యూటీ ప్రకారం కారణాలు , వివరాలు అడిగేరట. రాత్రిళ్ళు ఆయన గురకని భరించలేకుండా వున్నాను. అంచేత నాకు విడాకులు కావాలందిట భార్య.దీన్ని బట్టి సదరు భర్త గురక కచేరీలో ఎంత విద్వాంసుడై వుండాలో వూహించండి. అంచేత అన్నం వేరు, కూర వేరు, మంచి అన్నం వేరు, మంచి కూర వేరు, ఈ మధ్యనే ఒక కాలేజీలో ' నీ క్కాబోయే భర్త ఎలాంటి వాడయి వుండాలని కోరుకుంటున్నారో క్లుప్తంగా ఒక వాక్యం మించకుండా వ్రాయమని అడిగితే. ఒక స్టూడెంట్ ఎవరికీ పనికిరాని వాడయి వుండాలి అని రాసిందట. అంటే ఆ సుందరికి అంద చందాల కన్నా అణుకువగా పడుంటే వాడు కావాలన్న మాట. వీటినే ప్లేసెఫ్ పెళ్ళిళ్ళంటారు. అనుకున్నవన్నీ అనుకున్నట్లుగా జరిగితే అంతా ఆనందమే. కానీ అలా జరగదు. సుందరికీ పెళ్ళవుతుంది. కానీ ఆ సుందరుడికి హెవీ డిమాండు వుంటుంది. అంచేత ఇంటికి రాడు. సుందరిని చూసుకోడు. తరువాయి కధ మామూలే ! నా భార్య ఉద్యోగం వెలగబెట్టక్కర్లేదు. ఇంటిని, పిల్లల్ని చూసుకుంటే అదే పదివేలు అనే ధియరీ గల సుందరుడికి పది ఇళ్ళు తిరిగే సుందరమ్మ తగులుకుంటుంది. పిల్లలు వీధుల్లో, సుందరుడు ఆఫీసులో , ఇహ సుందరమ్మ ఎవరి ఇంట్లోనో ? ఎక్కే గుమ్మం , దిగే గుమ్మం.

జీవితానికి భాష్యం చెప్పగలిగే పెద్దవాళ్ళు ఏమంటారో తెలీదు గానీ మనలాంటి సామాన్యులకి ఇవన్నీ చూస్తుంటే విధి మనతో నిజం గానే ఆడుకుంటోందనిపిస్తుంది. కోరింది దొరకదు. దొరికింది నచ్చదు. అలాగని అందరి విషయంలో అలా జరక్క పోవచ్చు. కోరుకున్నవి దొరికిన అదృష్ట వంతులుంటారు. వాళ్ళకి జీవితం ఒక కమ్మటి పాట. అలాంటి సుందరి సుందరాంగులకి జిందాబాద్ !

------- అయ్యిపోయింది -------